# ఇల్లు అద్దెకు ఇవ్వబడును

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

మినీ కథ



— చంద్ర

**ఆ బోర్డు** కామేశ్వరరావు కళ్ళకి కల్పవృక్షంలాగానో, కామధేనువు లాగానో కనపడింది. నల్లటి రంగు పూసిన రేకుమీద తెల్ల అక్షరాల్లో తెలుగులో రాయబడి ఉంది.

"ఇల్లు అద్దెకు ఇవ్వబడును. వివరాలకు మేడమీద."

కామేశ్వరరావు సిటీ బస్‌లోంచి దిగేశాడు. తను దిగాల్సిన బస్ స్టాప్‌లు ఇంకా ఆరు ఉన్నా ఆ ఇంటి మేడమెట్లు ఎక్కడో కనుక్కొని సరాసరి పైకెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు.

ఒక అరవై ఏళ్ళ ముసలావిడ తలుపు తెరిచింది.

"ఎవరు కావాలి?" అడిగింది అతని ఎగా దిగా చూసి.

"ఇల్లు అద్దెకుందని బోర్డు చూశాను..."

ఆవిడ తల వూపి లోపలికి రమ్మన్నట్లు సౌంజ్ఞ చేసింది. ఆవిడ లోపలి గదిలోకి వెళ్ళి అర నిముషంలో ఆవిడ కన్నా వృద్ధుడుగా కనిపించే ఒకాయనతో వచ్చింది.

"ఎక్కడ పనిచేస్తున్నావ్?" అడిగాడాయన.

"ఎల్. ఐ. సి. లో"

"కూర్చో."

ఎల్. ఐ. సి. పేరు విన్నాక ఆయన మొహం కొద్దిగా ఉదాసీనంగా మారింది

"ఎంతజీతం ?"

"పద్నాలుగు వందలు చేతికివస్తాయి. నేను, మా చెల్లెళ్ళిద్దరు ఉంటాం. ఇంకా పెళ్ళి కాలేదు. మూడు గదులుండాలి, వంటగదితో కలిపి. ఎప్పుడైనా మా అమ్మ వస్తూంటుంది. చెల్లెళ్ళిద్దరూ చదువుతున్నారు. ఆరో తరగతి, ఎనిమిదో తరగతి" తన వివరాలు గబగబా చెప్పాడు కామేశ్వరరావు.

"వెజిటేరియన్వేగా?"

తలవూపాడు.

"ముందుభాగం చూడు నాయనా" చెప్పింది ఇంటావిడ. ఆవిడే తీసుకెళ్ళి చూపించింది. విశాలమైన గదులు. పెద్ద కిటికీలు. చక్కటి వెంటిలేషన్. సున్నంకొట్టి ఆట్టే రోజులు కాలేదన్న గుర్తుగా సున్నం వాసన.

"మీ చెల్లెళ్ళకి వంట వచ్చా?" అడిగింది.

"వచ్చు మామ్మగారు. గేస్ స్టవ్ ఉంది."

"పెళ్ళెందుకుచేసుకోలేదు బాబూ?"

"సంబంధాలు చూస్తున్నారు మా అమ్మగారు."

మళ్ళీ ముగ్గురు గదిలోకి వచ్చారు.

"అద్దె నాలుగు వందలు. కరెంట్ నీళ్ళకి నెలకి పదిహేను అదనంగా ఇవ్వాలి. రోజు విడిచి రోజు మా పని మనిషి మెట్లు తుడవాలి" చెప్పాడు ముసలాయన.

"అలాగే సర్." నా పేరు కామేశ్వరరావు.

"ఇంటిని శుభ్రంగా ఉంచాలి నాయనా" చెప్పింది ముసలావిడ.

జేబులోంచి నాలుగువందలు తీసి ఆయన చేతిలో ఉంచి అన్నాడు.

"రెండో తారీఖు మంచిరోజు. ఆ రోజు సాయంత్రం ప్రవేశిస్తానండి."

"అలాగే."

రెండో తారీఖు ఉదయం ఎల్.ఐ.సి. కి వచ్చాడు ఆ ఇంటాయన. కామేశ్వరరావు సీటు దగ్గరకు వెళ్ళి అతని చేతిలో మాట్లాడకుండా నాలుగు వందలు ఉంచాడు.

"ఇదేమిటి?" సంభ్రమంగా అడిగాడు కామేశ్వరరావు.

"నీకు ఇల్లు ఇవ్వటంలేదు. మరో పది తక్కువవచ్చినా ఇంకొకరికి ఇచ్చేశాం."

"ఎందుకు? ఎందుకు?" గొణిగాడు కామేశ్వరరావు.

"మా పక్కింటావిడ నిన్ను గుర్తుపట్టి చెప్పబట్టి సరిపోయింది. లేకపోతే..."

"ఏం చెప్పింది?"

"ఈ వారం పత్రికలో నీ ఫోటో అచ్చయిందటగా? నువ్వు రచయితవని చెప్పింది. బ్రహ్మచారులకయినా ఇస్తాం కాని రచయితలకి ఇల్లివ్వను" వెళ్ళిపోయాడాయన.